సాక్షి కర్నూలు

సోమవారం । 17 । మార్చి । 2025



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఆదివారం స్వామిఅమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు చేపట్టారు.



గొంతులు ఎండుతున్నాయ్ !

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు గ్రామాల ప్రజల గొంతులు ఎండుతున్నాయని అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రజా ప్రతినిధులు జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. - 8లో



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం విజయవాడకు చెందిన పి.మానసతేజ బృందం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:33	ఉ॥ 5:02
ఆదోని	సా॥ 6:32	ఉ॥ 5:02
నంద్యాల	సా॥ 6:30	ఉ॥ 5:02
ఆత్మకూరు	సా॥ 6:29	ఉ॥ 4:57
బనగానపల్లె	సా॥ 6:32	ఉ॥ 5:00

హదీస్ వెలుగు :

మీ సంతానం తప్పుల పట్ల శాపనార్థాలు పెట్టకండి. పవిత్ర రంజాన్ మాసంలో మీ శాపాల పట్ల దైవదూతలు ఆమీన్ అంటే అల్లాహ్ దానిని నిజం చేస్తారు.

– పవిత్ర ఖురాన్

దిగుబడి వెక్కిరిస్తూ.. ధర కన్నీళ్లు పెట్టిస్తూ!

మిర్చి రైతుకు దక్కని భరోసా

- కాయకుళ్లుతో భారీగా పెరిగిన పెట్టుబడి వ్యయం
- ఎకరాకు రూ.1.50 లక్షల వరకు ఖర్చులు
- నగటు దిగుబడి 15 క్వింటాళ్లకే పరిమితం
- ఇందులోనూ 30–40 శాతం తాలు కాయలు
- నేడు మిర్చికి లభిస్తున్న ధర రూ.10 వేలలోపే



కర్నూలు(అగ్రికల్చర్): గతంలో ఎప్పుడూ లేని విధంగా మిర్చి రైతులు నష్టాలు మూటకట్టుకుంటున్నారు. మిర్చి ధర విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల జీవితాలతో ఆడుకుంటున్నాయి. వారం రోజులుగా హడావుడి చేయడం మినహా ఎలాంటి ఉపయోగం లేకపోయింది. మిర్చిలో దిగుబడులు పెంచుకోవడం లక్ష్యంగా సూక్ష్మ సేద్య పద్ధతులు పాటిస్తున్నారు. ఏ జిల్లాలో లేని విధంగా మిర్చి సాగులో మల్చింగ్‌ను కూడా వినియోగిస్తున్నారు. అయినప్పటికీ రెక్కల కష్టానికి తగిన ప్రతిఫలం లేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారు. ధర లేక మిర్చి రైతులు కన్నీరుమున్నీరవుతున్నా ప్రభుత్వం హడావుడికే పరిమితమైంది.

తెగుళ్లతో తగ్గిన దిగుబడి

కర్నూలు జిల్లాలో మిర్చి 95,478 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 22,390 ఎకరాల్లో సాగు చేశారు. బ్యాడిగ రకాల్లో దిగుబడి ఎకరాకు సగటున 8 క్వింటాళ్ల వరకే వస్తుంది. అధిక వర్షాల ప్రభావంతో కాయకుళ్లు తెగులు తీవ్రత పెరిగి దిగుబడులు తగ్గిపోయాయి. ఈ తెగులును నివారించుకునేందుకు కెమికల్స్ వినియోగం రెట్టింపయ్యింది. మామూలుగా అయితే ఎకరాకు సగటున 25 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉంది. కాయకుళ్ల తెగులు ప్రభావంతో దిగుబడులు సగటున 15 క్వింటాళ్లకే పరిమితం కావడం గమనార్హం. ఇందులో తాలు కాయలు 30–40 శాతం వరకు ఉన్నట్లు ఉద్యాన అధికారులే స్పష్టం చేస్తున్నారు. ఎకరాకు సగటున రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం క్వింటాకు సగటు ధర రూ.10 వేల వరకు మాత్రమే లభిస్తుండటంతో పెట్టుబడి దక్కడం కూడా కష్టమవుతోంది.



క్వింటాకు రూ.10 వేల వరకే ధర

గత ఏడాది పండించిన మిర్చి ఇప్పటికీ గోదాముల్లో ఉంది. ఈ సారి 3.50 ఎకరాల్లో మిర్చి సాగు చేశాం. ఎకరాకు పెట్టుబడి వ్యయం రూ.1.50 లక్షల వరకు వస్తోంది. ఎకరాకు 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చి ధర కనీసం రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు లభిస్తేనే గిట్టుబాటు అవుతుంది. ప్రస్తుతం ఇప్పటి వరకు 60 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇందులో 20 క్వింటాళ్లు తాలు కాయలే. ప్రస్తుతం దళారీలు క్వింటా రూ.10 వేల చొప్పున అడుగుతున్నారు. ఈ ధరతో అమ్ముకుంటే పెట్టుబడి కూడా దక్కదనే భయంతో ఏసీ గోదాముల్లో నిల్వ చేశాం.

– ఎర్ర చిన్న సతీష్, బసలదొడ్డి, పెద్దకడుబూరు మండలం

పోటీపడి సాగు చేసిన రైతులు

మిర్చి సాగు చేయడం ఒక ఎత్తు అయితే.. కోతలు మరో ఎత్తు. క్వింటా మిర్చి తెంపడానికి 10 మంది కూలీలు అవసరం.ఒక్కొక్కరికి రూ.300 ప్రకారం రూ.3 వేలు ఖర్చు అవుతోంది. 2021–22 నుంచి 2023–24 వరకు రైతులకు మిర్చి సాగు కలసి వచ్చింది. నేడు ధర నేలను తాకడంతో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. 2022–23లో కర్నూలు జిల్లాలో 1,29,575, నంద్యాల జిల్లాలో 35,690 ఎకరాల్లో మిర్చి సాగయింది. ఆ ఏడాది ఎకరాకు సగటున 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. బ్యాడిగ రకాలు క్వింటా రికార్డు స్థాయిలో రూ.56 వేల వరకు ధర పలికింది. ఈ నేపథ్యంలో 2023–24లోనూ రైతులు పోటీపడి సాగు చేశారు. ఈ–క్రాప్ బుకింగ్ ప్రకారం కర్నూలు జిల్లాలో 1,51,098, నంద్యాల జిల్లాలో 45,893 ఎకరాల్లో సాగయింది. అనావృష్టి పరిస్థితులు నెలకొన్నప్పటికీ దిగుబడి సగటున రూ.20 క్వింటాళ్ల పైగానే వచ్చింది.

క్వింటాకు రూ.16 వేలు ధర నిర్ణయిస్తేనే..

ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన మిర్చి నిల్వలు ఇప్పటికే ఏసీ గోదాముల్లో 30వేల టన్నుల వరకు పేరుకుపోయినట్లు సమాచారం. ఈ సారి 1.43 లక్షల టన్నుల మిర్చి మార్కెట్‌లోకి వస్తోంది. దిగుబడి తగ్గడం, పెట్టుబడి వ్యయం పెరుగడం వల్ల క్వింటాకు కనీస ధర రూ.16వేలుగా నిర్ణయిస్తేనే రైతులకు పెట్టుబడి దక్కే అవకాశం ఉంటుంది. అయితే కేంద్రం రూ.11,781 కంటే ధర తగ్గినప్పుడే జోక్యం చేసుకుంటామన్నా ఆ దిశగా చర్యలు శూన్యం. ప్రస్తుతం సగటున మిర్చికి లభిస్తున్న ధర రూ.రూ.8వేల నుంచి రూ.10 వేల వరకు మాత్రమే. అయినప్పటికీ మిర్చి రైతుకు న్యాయం జరుగకపోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు వైఫల్యానికి అద్దం పడుతోంది.

ఐదేళ్లలో కర్నూలు మార్కెట్‌లో మిర్చి ధరలు (రూపాయల్లో) ఇలా...

సంవత్సరం	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర	సగటు ధర
2021-22	1,020	26,506	9,798
2021-22	1,001	24,252	9,099
2022-23	1,819	50,618	20,589
2023-24	3,099	38,399	20,000
2024-25	1,099	16,513	9,300

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు?

- కేసు నుంచి నిందితులను తప్పించేందుకు టీడీపీ ముఖ్యనేత ప్రయత్నాలు

కర్నూలు: షరీన్‌నగర్‌కు చెందిన టీడీపీ నాయకుడు సంజన్న హత్య కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ నెల 15వ తేదీ రాత్రి సంజన్న దారుణ హత్యకు గురయ్యాడు. దాదాపు 15 మంది దాకా ఈ హత్యలో పాల్గొన్నట్లు స్థానికులు చెబుతుండగా, ఐదుగురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. హత్య జరిగిన రోజు రాత్రే హంతకులు రెండు వాహనాల్లో పారిపోతుండగా, హ్యాంగ్ అవుట్ హోటల్ సమీపంలో ఒక వాహనం టైర్ పేలడంతో రెండు వాహనాలను అక్కడే వదిలేసి ఆటోల్లో నిందితులు పరారయ్యారు. రింగ్ రోడ్ సమీపంలోని కాదంబరి టౌన్‌షిప్ దగ్గరలోని ఓ గదిలో తలదాచుకున్నారు. టీడీపీకి చెందిన ఓ ముఖ్య నేత పోలీసులతో సంప్రదింపులు జరిపి నిందితులను లొంగిపోయినట్లు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వడ్డె రామాంజనేయులు, ఆయన కుమారులు రేవంత్, శివ, కుమార్‌తో పాటు ఆయన అల్లుడు వీరేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కర్నూలు శివారు దిన్నెదేవరపాడు వద్ద ఉన్న పోలీస్ స్థావరంలో ఉంచి విచారణ జరుపుతున్నట్లు సమాచారం. అయితే, హత్యకు పాల్పడిన వారిలో కొందరిని ఈ కేసు నుంచి తప్పించేందుకు టీడీపీ ముఖ్య నేత తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఎస్‌హెచ్‌ఓపై పోలీస్ బాస్ సీరియస్ ...

సంజన్న హత్య కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న వడ్డే రామాంజనేయులుపై అనేక కేసులు ఉన్నప్పటికీ అతన్ని ఎందుకు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వలేదని ఎస్‌హెచ్‌ఓపై ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. స్టేషన్ పరిధిలో ఎంత మంది రౌడీ షీటర్లు ఉన్నారు? వారం వారం ఎంత మందికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు ? అనే విషయాలపై కూడా ఎస్‌హెచ్‌ఓ సరైన సమాధానాలు ఇవ్వకపోవడం పట్ల తీవ్రంగా మందలించినట్లు తెలుస్తోంది.

న్యూస్‌రీల్

అమరజీవికి ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ

కర్నూలు: జిల్లా పోలీస్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయ మైదానంలో చిత్రపటానికి అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా పూలమాల వేశారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలను, సేవలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు సీఐలు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరులోపు రుణాలు చెల్లిస్తే అపరాధ వడ్డీ మినహాయింపు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో నిరర్థక ఆస్తులుగా మిగిలి పోయి న దీర్ఘకాలిక రుణాల రికవరీల కోసం ఉద్దేశించిన ఉపశమన పథకం గడువు ఈ నెల చివరి వరకు మాత్రమే ఉందని సీఈఓ విజయకుమార్ తెలిపారు. డీసీసీబీ బ్రాంచీల ద్వారా దీర్ఘకాలిక రుణాలు తీసుకొని.. రికవరీ చేయక నిరర్థక ఆస్తులుగా మిగిలిపోయిన బకాయిలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ నెల చివరిలోపు అప్పు మొత్తాన్ని చెల్లిస్తే.. అపరాధ వడ్డీ మినహాయింపు ఉంటుందని, వడ్డీ మీద వడ్డీలో గరిష్ఠంగా రూ.50 వేల వరకు మాఫీ ఉంటుందన్నారు. ఇటువంటి బకాయిలు ఉమ్మడి జిల్లాలో రూ.15 కోట్ల వరకు ఉన్నాయని తెలిపారు. దీర్ఘకాలిక రుణాలు అంటే డెయిరీ, గొర్రెల, మైనర్ ఇరిగేషన్, డ్రిప్ ఇరిగేషన్ వంటి వాటికి తీసుకున్న రుణాలకు మాత్రమే ఈ మినహాయింపులు ఉంటాయని పేర్కొన్నారు.

రూ.61.22 కోట్ల పన్ను వసూళ్లు

కర్నూలు (టౌన్): 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కర్నూలు నగరపాలక సంస్థ ఆస్తి, నీటి పన్నులను రూ.61.22 కోట్లు వసూలు చేసినట్లు ఆ సంస్థ మేనేజర్ చిన్నరాముడు తెలిపారు. ఆదివారం ఆయన పన్ను వసూళ్ల కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. పన్ను వసూళ్లు నగరంలో ముమ్మరంగా సాగుతుందన్నారు. సెలవు రోజైన ఆదివారం రెవెన్యూ, సచివాలయాల సిబ్బంది స్పెషల్ డ్రైవ్ చేపట్టారన్నారు. ఈ నెలాఖరుకు 100 శాతం పన్నులు వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

నకిలీ వెబ్‌సైట్లను నమ్మి మోసపోవద్దు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం పేరుతో రూపొందించిన నకిలీ వెబ్ సైట్లను నమ్మి మోసపోవద్దని శ్రీశైల దేవస్థానం ఈఓ ఎం. శ్రీనివాసరావు భక్తులకు సూచించారు. ఆదివారం ఈఓ మాట్లాడుతూ దేవస్థానం వసతిని ముందస్తుగా రిజర్వు చేసుకునేందుకు, ఆర్జితసేవలు, దర్శనం టికెట్లు పొందేందుకు దేవస్థానం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. అయితే, ఈసేవలు పొందేందుకు దేవస్థానం వెబ్‌సైట్ www.srisailadevasthanam. org, దేవదాయ శాఖ అధికారిక వెబ్‌సైట్ www. aptemples. ap. gov. inలను మాత్రమే వినియోగించుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు దేవస్థానం సమాచార కేంద్రం ఫోన్ నంబర్లు 83339 01351/52/53ను సంప్రదించాలన్నారు.

26 నుంచి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు బిహార్ రాష్ట్రంలోని జహీరాబాద్‌లో 46వ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్ బాలుర చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి. శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నిప్పుల వాన

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



కర్నూలు(అగ్రికల్చర్): మార్చి నెలలోనే భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. వేడి సెగలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వడగాలులు, ఎండ తీవ్రత రోజురోజుకి పెరిగిపోతోంది. ఎండలు మండుతున్నా అధికారులు చలువ పందిళ్లు, చలివేంద్రాలు ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తున్నారు. రాష్ట్రంలోనే అధిక ఉష్ణోగ్రతలు ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే నమోదవుతున్నాయి. ఆదివారం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 41 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. కర్నూలు జిల్లా కోడు మూరులో 41.4, కల్లూరులో 41.3 కర్నూలు అర్బన్‌లో 41, నంద్యాల జిల్లా రుద్రవరంలో 41.8, కొత్తపల్లిలో 41.1 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆలూరు, సి.బెళగల్, హాలహర్వి, కోసిగి, మంత్రాలయం, పెద్దకడుబూరు, జూపాడుబంగ్లా, ఆత్మకూరు, మహానంది, పగిద్యాలలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పది పరీక్షలకు అంతా సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం కానున్న పరీక్షలు
- జిల్లాలో 172 కేంద్రాలు ఏర్పాటు
- పరీక్షలకు హాజరుకానున్న 40,776 మంది విద్యార్థులు
- సమస్యాత్మకమైన కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు



నందవరం జెడ్పీ పాఠశాలలో బెంచీలపై హాల్ టికెట్ల నెంబర్లు వేస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: పాఠశాల విద్యలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయబోతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇంగ్లిషు మీడియం, ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌తో విద్యార్థులు మొదటిసారి పరీక్షలు రాయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 40,776 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 31,410 మంది, ప్రైవేటు 7,038 మంది, ఓపెన్ టెన్త్ విద్యార్థులు 2,328 మంది హాజరుకానున్నారు. ఇందులో 23,486 మంది ఇంగ్లిషు మీడియం, 5,068 మంది తెలుగు, 379 మంది ఉర్దూ, 477 మంది కన్నడ మీడియంలో నేటి (సోమవారం) నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. గత ప్రభుత్వం మన బడి నాడు–నేడు కింద అన్ని రకాల వసతులు కల్పించడంతో సదుపాయాల కొరత తీరింది. రెగ్యులర్ టెన్త్‌తో పాటు, ఓపెన్ స్కూల్ పది పరీక్షలు సైతం ఒకే సమయంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 172 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓపెన్ స్కూల్ పరీక్షలకు 20 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు 172 మంది ముఖ్య పర్యవేక్షకులను, 172 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 1,840 మంది ఇన్విజిలెటర్లను, సీ సెంటర్లకు 11 మంది కస్టోడియన్స్, 7 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాల్లోని గార్గేయపురం జెడ్పీ హైస్కూల్, రామళ్లకోట జెడ్పీ హైస్కూల్, ఉల్చాల జడ్పీ హైస్కూల్, ఆస్పరి జడ్పీ హైస్కూల్ ఏ సెంటర్, బీ సెంటర్, ఏపీ మోడల్ స్కూల్ గాజులదిన్నెలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

ఆల్ ది బెస్ట్

ఉజ్వల భవిష్యత్తుకు మొదటి మెట్టు పదవ తరగతి. పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు పాజిటివ్ ఆలోచనతో పరీక్షలు రాయాలి. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు పట్టుదలతో విజయవంతంగా పూర్తి చేయాలి. పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి.

– పి.రంజిత్ బాషా, జిల్లా కలెక్టర్

పకడ్బందీగా ఏర్పాట్లు

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చట్ట రీత్యా చర్యలు ఉంటాయి. విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అనుమతించారు. కేంద్రాల్లోకి ఎలాంటి సెల్‌ఫోన్లు అనుమతించం. పరీక్షల్లో ఏవైనా సమస్యలు తలెత్తినా, సందేహాలు ఉన్నా డీఈఓ ఆఫీస్‌లో కంట్రోల్ రూం నంబర్ 98855716544ను సంప్రదించవచ్చు.

– ఎస్.శామ్యూల్ పాల్, డీఈఓ.



➤ కర్నూలు గణేష్‌నగర్‌లో గ్యాస్ బండ ఇచ్చే సమయంలో బిల్లు కంటే రూ.50 అదనంగా ఇవ్వాలని బాయ్ డిమాండ్ చేశాడు. ఎందుకని ఇంటి యజమాని ప్రశ్నించగా.. కచ్చితంగా ఇవ్వాల్సిందేనని వాదించాడు. విధిలేని పరిస్థితుల్లో ఆయన రూ. 30 ఇచ్చి గ్యాస్ సిలిండర్‌ను తీసుకున్నాడు. అయితే బాయ్ ఈ విషయాన్ని మనసులో పెట్టుకొని మరుసటి నెలలో గ్యాస్‌ను బుక్ చేస్తే చాలా రోజులు ఇవ్వలేదు.

➤ కర్నూలు లక్ష్మీనగర్‌కు చెందిన ఓ మహిళా గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసుకొని ఆన్‌లైన్‌లోనే ముందస్తుగా బిల్లు చెల్లించారు. మరుసటి రోజు గ్యాస్ సిలిండర్‌ను బాయ్ తీసుకొచ్చిన బాయ్.. ఆమె కార్యాలయం వెళ్లడంతో ఫోన్ చేశారు. మీరు రెండో అంతస్తులో ఉన్నారు రూ.50 డెలివరీ చార్జీ ఇవ్వాలని అడిగాడు. ఆమె మొత్తం బిల్లులోనే చెల్లించాను కదా అని ప్రశ్నించగా.. 'రూ.50 ఇస్తేనే సిలిండర్‌ను డెలివరీ చేస్తాను, లేదంటే ఏజెన్సీకే వచ్చి తెచ్చుకోండి' అంటూ వెనక్కి తీసుకెళ్లాడు.

.. జిల్లాలో డబ్బులు ఇస్తేనే గ్యాస్ సిలిండర్లను డెలివరీ చేస్తున్నారు. ఉచితంగా దింపాల్సిన సిలిండర్లను ముక్కుపిండి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. అపార్టుమెంట్లలో అంతస్తు పెరిగే కొద్ది రేటు పెంచి దోపిడీ చేస్తున్నారు.

గ్యాస్ డెలివరీలో నిలువు దోపిడీ!

- కనీసంగా రూ.30 వసూలు
- అంతస్తులు పెరిగే కొద్ది రూ.10 పెంచుతున్న వైనం
- 15 కిలోమీటర్ల వరకు ఎలాంటి రుసుం వసూలు చేయరాదంటున్న నిబంధనలు
- దోపిడీకి డెలివరీ బాయ్స్‌కు అనుమతి ఇస్తున్న గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యాలు
- ఫిర్యాదు చేస్తే ఇబ్బందులు సృష్టిస్తున్న డెలివరీ బాయ్స్
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న పౌరసరఫరాల అధికారులు

కర్నూలు(సెంట్రల్): గ్యాస్ సిలిండర్ డెలివరీ కోసం 15 కిలోమీటర్ల వరకు ఎలాంటి రుసుం వసూలు చేయరాదు. 15 కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్ల వరకు సిలిండర్‌కు రూ.30 వసూలు చేయాలి. అయితే ఎక్కడా ఆ నిబంధనలు అమలు కావడం లేదు. ఐదు కిలోమీటర్ల లోపే సిలిండర్లు డెలివరీ అవుతున్నా కనీసంగా రూ.30 వసూలు చేస్తున్నారు. అపార్టుమెంట్లలో అంతస్తుకు రూ.15 చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్నారు. మొదటి అంతస్తులోకి సిలిండర్ రావాలంటే రూ.45, రెండో అంతస్తులోకి రావాలంటే రూ.50, మూడో అంతస్తులోకి రావాలంటే రూ.60 వరకు వసూలు చేస్తున్నారు.

ఎదురిచ్చి గ్యాస్ సిలిండర్ల డెలివరీ!

జిల్లాలో దాదాపు 30 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. ఇందులో 6,67,456 మందికి గ్యాస్ కనెక్షన్లు ఉండగా, భారత్, హెచ్‌పీ, ఐటీసీ కంపెనీలు గ్యాస్‌ను సరఫరా చేస్తున్నాయి. ఎక్కువగా ప్రజలు భారత్ గ్యాస్ కంపెనీ సిలిండర్లనే వినియోగిస్తున్నారు. నిబంధనలు ప్రకారం ఒక వినియోగదారుడు బుక్ చేసుకున్న సిలిండర్‌ను డెలివరీ చేసేందుకు నిర్వహణలో ఉన్న ఏజెన్సీలు వాహనాలు, బాయ్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలి. బాయ్స్‌కు వారే జీతాలు ఇవ్వాలి. అయితే ఏజెన్సీలు ఇక్కడే మోసం చేస్తున్నాయి. సొంతంగా ఆటోలు ఉన్న వారితో కలసి సిలిండర్లను డోర్ డెలివరీ చేసే బాధ్యతను వారికి అప్పగిస్తున్నారు. ఇలా వారి మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఏజెన్సీ నిర్వాహకులు ఆటోగాని, డెలివరీ బాయ్‌కుగాని ఎలాంటి బాడుగ, జీతాలు చెల్లించరు. ఆటో యజమానే డెలివరీ చేసి వినియోగదారుల నుంచి వసూలు చేసుకోవాలి. దీంతో ఆటో యజమానులు గిట్టుబాటు కోసం దోపిడీ చేస్తున్నారు. ఎక్కువ కనెక్షన్లు ఉన్న ఏజెన్సీలకు అయితే ఆటో యజమానులే ఎదురు చెల్లించి డెలివరీ చేసేందుకు ఒప్పందం చేసుకుంటారట. దీంతో డెలివరీ బాయ్స్ కనీసంగా రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేసుకొని గిట్టుబాటు చేసుకుంటున్నారు. ఇదే సమయంలో సిలిండర్ బిల్లింగ్‌లో డెలివరీ కోసం కేటాయించిన మొత్తం ఏజెన్సీల ఖాతాలోకి వెళ్లిపోతోంది. మొత్తంగా వినియోగదారుడే ఏజెన్సీ, డెలివరీ బాయ్ చేతిలో మోసపోయి దగాపడుతున్నాడు.



సిలిండర్‌ను డెలివరీ చేస్తున్న బాయ్స్

నోటీసులతో సరి..

గ్యాస్ పంపిణీపై నెలరోజులుగా 60కి పైగా ఫిర్యాదులు అందాయి. వీటిలో గ్యాస్ డెలివరీ కోసం అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులే అధికం. ఈ క్రమంలో ఫిబ్రవరి నెలలో ఏజెన్సీలకు అధికారులు నోటీసులు ఇచ్చిసరిపెట్టారు. వారిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదు. ఇటీవల గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి డెలివరీ కోసం డబ్బులు తీసుకోరాదని స్వయంగా జేసీ డాక్టర్ బి.నవ్య చెప్పారు.

ఫిర్యాదు చేస్తేనే చర్యలు

గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీని పౌర సరఫరాల అధికారులు పరిశీలించడం లేదు. నెలవారీగా ఏజెన్సీ నిర్వాహకుల నుంచి వస్తున్న డబ్బులు తీసుకొని మిన్నకుండి పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సిలిండర్ డెలివరీ విషయంలో చాలామంది వినియోగదారులు బాయ్స్‌తో గొడవ పడి ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో దోపిడీ యథాతథంగా కొనసాగుతోంది.

నిబంధనలు పాటించాలి



15 కిలోమీటర్ల వరకు గ్యాస్ సిలిండర్ డెలివరీ కోసం ఎలాంటి రుసుం వసూలు చేయరాదు. అలా వసూలు చేస్తే మాకు ఫిర్యాదు చేయాలి. వచ్చిన ఫిర్యాదులపై తక్షణం స్పందిస్తున్నాం. వచ్చిన ఫిర్యాదులను వచ్చినట్లుగానే పరిష్కరిస్తున్నాం. 15 కిలో మీటర్లు దాటితే సిలిండర్‌కు రూ.30 వసూలు చేయాలని ప్రభుత్వం నిబంధనలు ఉన్నాయి. ఏజెన్సీలు విధిగా నిబంధలను పాటించాలి.

–రాజారఘువీర్, డీఎస్‌ఓ, కర్నూలు



గరుడ వాహనంపై ఊరేగిన ప్రహ్లాదవరదుడు

భక్తజనుల గోవింద నామస్మరణ మధ్య ప్రహ్లాదవరదుడు గరుడ వాహనంపై ఊరేగారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు ఈ కార్యక్రమం సాగింది. ఉత్సవాల్లో చివరి రోజు నిర్వహించిన గరుడోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కు చెల్లించుకున్నారు. దిగువ అహోబిలం భక్త జనసందోహంతో కిటకిటలాడింది. – ఆళ్లగడ్డ

గొంతులు ఎండుతున్నాయ్ !

- తాగునీటి సమస్యపై అధికార, ప్రతిపక్ష సభ్యులు గగ్గోలు
- హామీ ఇవ్వకుండా మంత్రి టీజీ భరత్ వెళ్లిపోవడంపై అసహనం
- నీటి పారుదలపై సుదీర్ఘ చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, చిత్రంలో మంత్రి టీజీ భరత్, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు రంజిత్‌బాషా, రాజకుమారి



తాగునీటి సమస్యపై ప్రశ్నిస్తున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, చిత్రంలో సర్వసభ్య సమావేశానికి హాజరైన జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు

కర్నూలు(అర్బన్): వేసవి ప్రారంభంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అనేక గ్రామాల ప్రజల గొంతులు ఎండుతున్నాయని అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి, ప్రజల దాహార్తిని తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆలూరు, పాణ్యం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు బి. విరూపాక్షి, గౌరు చరితారెడ్డి, జి. జయసూర్య, కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు పి. రంజిత్‌బాషా, రాజకుమారి గణియా, కర్నూలు జేసీ డా.బి. నవ్య, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. అజెండాలో పొందుపరిచిన విధంగా తాగునీరు, వ్యవసాయం, ఇరిగేషన్ శాఖలపై సుదీర్ఘంగా చర్చించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో చాలా ఏళ్ల క్రితం నిర్మించిన 60కి పైగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు ఉన్నాయని, వాటి నిర్వహణను ఎప్పటికప్పుడు చెక్ చేస్తున్నారా? అని రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ప్రశ్నించారు. కట్టలు బలహీనపడి పోవడం, లీకేజీలను పరిశీలించకుంటే సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. వాటిని తనిఖీ చేసి నివేదికలు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.

రిజర్వాయర్ల విస్తరణ చేపట్టాలి..
ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. జనాభా పెరిగిన నేపథ్యంలో చింతకుంట, బాపురం రిజర్వాయర్లను విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే ఆలూరు చెరువు అన్యాక్రాంతం కాకుండా ఎస్ఎస్ ట్యాంకును నిర్మించాలన్నారు. సమ్మతగేరిలో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించాలని, కోగిలతోట గ్రామంలో శిథిలావస్థకు చేరిన ఓహెచ్ఎస్ఆర్‌ను తొలగించి కొత్త ఓహెచ్ఎస్ఆర్‌ను నిర్మిస్తుండడం వల్ల గ్రామంలో తీవ్ర మంచినీటి సమస్య ఉందన్నారు. పందికోన రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ వేస్తే ఆస్పరి మండలంలోని పలు గ్రామాల నీటి సమస్య తీరే అవకాశం ఉందన్నారు. అలాగే తుంగభద్ర డ్యామ్ గేట్లకు సంబంధించిన చైన్ లింకులను మొత్తం మార్చాలని కేంద్ర బృందం సూచించిందని, ఇందుకు రూ.150 కోట్ల వరకు వ్యయం కానుందన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నయాపైసా కూడా కేటాయించలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని కోరారు.

మంత్రికి ప్రజల సమస్య పట్టదా..

సమావేశం జరుగుతున్న సమయంలో రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, జయసూర్య వెళ్లిపోవడం పట్ల ఆలూరు ఎమ్మెల్యే బి. విరుపాక్షితో పాటు పలువురు జెడ్పీటీసీ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుత వేసవిలో నెలకొన్న తాగునీటి సమస్యపై సుదీర్ఘ చర్చ జరుగుతున్న సమయంలో రాష్ట్ర మంత్రిగా ఎలాంటి హామీ ఇవ్వకుండా వెళ్లడం ఏమిటని వారు ప్రశ్నించారు. వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులకు సంబంధించి పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో తమ వాణిని వినిపించాల్సిన ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా వెళ్లిపోవడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు.

రూ.6.47 కోట్ల పనులకు ఆమోదం

జిల్లా పరిషత్ సాధారణ నిధులు, 2024–25 ఆర్థిక సంవత్సరం నిధులు, మిగులు నిల్వలు కలిపి మొత్తం రూ.6.47 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు జెడ్పీ సర్వసభ్య సమావేశం ఆమోదం తెలిపింది. ఆదివారం జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొత్తం 147 పనులను చేపట్టేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు.

నీటి వృథాను అరికట్టేందుకు రిజర్వాయర్లు అవసరం

... జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు జిల్లాకు పైభాగాన ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో కురిసిన అధిక వర్షాల వల్ల గత ఏడాది జూరాల నుంచి 1200 టీఎంసీలు, సుంకేసుల నుంచి 300 టీఎంసీల నీరు వృథాగా సముద్రం పాలైందని ఆందోళన వ్యక్తం చేశారు. నీటిని నిల్వ చేసుకునేందుకు రిజర్వాయర్లు లేని కారణంగా ప్రతి ఏడాది దాదాపు 540 టీఎంసీల నీరు వృథా అవుతుందన్నారు. వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి అయితే నీటి వృథాను కొంతమేర అరికట్టడంతో పాటు సాగు, తాగునీటికి ఉన్న ఇబ్బందులు తొలగే అవకాశం ఉంటుందన్నారు. అలాగే రబీ సీజన్‌లో ఏర్పడిన ఎరువుల కొరత ఖరీఫ్‌లో రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

సమావేశంలో ఎవరేమన్నారంటే ...

“ తుంగభద్ర దిగువ కాలువ నీటి సరఫరా గురించి చర్చించేందుకు వచ్చే సమావేశానికి టీబీ డ్యాం ఎస్ఈని పిలిపించండి
– కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

- నంద్యాల జిల్లాలో ఎక్కడా యూరియా కొరత రాలేదు. మోతాదుకు మించి ఎరువులను వినియోగించరాదని రైతులకు అవగాహన కల్పించాలి
–నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా
- గాజులదిన్నె ప్రాజెక్టుకు కూతవేటు దూరంలో ఉన్న కోడుమూరుకు శాశ్వత నీటి పరిష్కారం చేయాలి. అలాగే ఆస్పరి మండలం పుప్పాలదొడ్డి,బిల్లేకల్,అట్టేకల్ గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్యనూ పరిష్కరించాలి.
– కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు
- కల్లూరు మండలం యాపర్లపాడు, ఉల్లిందకొండ, తడకనపల్లె, పర్ల, ఎ. గోకులపాడు, నెరవాడ, ఓర్వకల్ మండలం తిప్పాయిపల్లె, సోమయాజులపల్లె, పొగరూరు, శకునాలలో నీటి సమస్యను పరిష్కరించాలి
– పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి
- చేతి పంపుల రిపేర్లకు మెకానిక్స్ రావడం లేదు – పగిద్యాల జెడ్పీటీసీ దివ్య
- బ్రహ్మగుండం నుంచి అదనంగా రెండవ పైప్‌లైన్ వేసి వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయతీలోని నీటి సమస్యను తీర్చండి
– వెల్దుర్తి జెడ్పీటీసీ సుంకన్న
- నాలుగు కేజీల మినుముల మినీ ప్యాకెట్స్ ఉచితమని చెప్పి రూ.300 వసూలు చేశారు.
– కొత్తపల్లి జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ కార్యదర్శిగా అబ్దుల్ గఫార్

ఓర్వకల్లు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శిగా అబ్దుల్ గఫార్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపకులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర మైనార్టీ విభాగంలో జిల్లాకు చెందిన కొందరికి స్థానం లభించినట్లు తెలిపారు. అందులో భాగంగా రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శిగా నన్నూరు గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు అబ్దుల్ గఫార్‌ను నియమించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈయన నియామకం పట్ల జిల్లా మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

క్రెడాయ్ నూతన చైర్మన్‌గా గోరంట్ల రమణ



నూతనంగా ఎన్నికైన క్రెడాయ్ కార్యవర్గ సభ్యులు

కర్నూలు (టౌన్): క్రెడాయ్ (కాన్ఫడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) నూతన చైర్మన్‌గా గోరంట్ల రమణ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక కల్లూరు రోడ్డులో ఉన్న క్రెడాయ్ భవనంలో క్రెడాయ్ సభ్యుల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కర్నూలు చాప్టర్ నూతన చైర్మన్‌తో పాటు అధ్యక్షుడిగా సురేష్ రెడ్డి, కార్యదర్శిగా గోవర్ధన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఆర్కిటెక్ రంగనాథ రెడ్డి వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ గోరంట్ల రమణ మాట్లాడుతూ 2015 నుంచి 2021 వరకు క్రెడాయ్ సంస్థలో కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశానన్నారు. క్రెడాయ్ సంస్థ ద్వారా ప్రాపర్టీషోలు నిర్వహించామన్నారు. నూతన కార్యవర్గంతో ఎన్నో ఒడిదుడుగులు ఎదుర్కొంటున్న నిర్మాణ రంగానికి నూతనోత్సాహం తీసుకువస్తామని స్పష్టం చేశారు.

రౌడీ షీటర్ల కదలికలపై నిఘా

- పోలీస్ స్టేషన్ల వారీగా రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు: కర్నూలు శివారుల్లోని షరీన్‌నగర్‌లో టీడీపీ నాయకుడు సంజన్న హత్య సంఘటన నేపథ్యంలో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. హంతకుడు వడ్డే రామాంజనేయులు అలియాస్ అంజిపై అనేక కేసులు ఉండడమే గాక, రౌడీ షీట్ కూడా ఉండడంతో రౌడీ షీటర్ల కదలికలపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా అంతటా పోలీస్ స్టేషన్ల వారీగా రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర ప్రవృత్తికి స్వస్తి పలికి గౌరవ ప్రదమైన జీవితం కొనసాగించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇస్తునే, కొత్తగా కేసుల్లో ఇరుక్కున వారి జాబితాను సిద్ధం చేస్తున్నారు. స్టేషన్ల వారీగా రౌడీ షీటర్లు జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై కూడా ఆరా తీస్తున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే, పోలీస్ శాఖ పరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సముద్ర శాస్త్రవేత్త ఎంపీఎం రెడ్డి సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న అరుణ భారతి అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి

కర్నూలు కల్చరల్: సుప్రసిద్ధ శాస్త్రవేత్త డాక్టర్ ఎంపీఎం రెడ్డి సేవలు చిరస్మరణీయమని అరుణ భారతి అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి అన్నారు. సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం తెలుగు కళా స్రవంతి ఆధ్వర్యంలో డాక్టర్ ఎంపీఎం రెడ్డి సంస్మరణ సభను నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ.. భారతీయ తొలి సముద్ర శాస్త్రవేత్తగా ఎదిగిన ఎంపీఎం రెడ్డి ఆదర్శనీయులు అన్నారు. ప్రపంచంలోని అన్ని సముద్రాలు సందర్శించి పరిశోధనలు చేశారని గుర్తు చేసుకున్నారు. సముద్ర శాస్త్రంపై ఈయన రాసిన పుస్తకాలను కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రచురించడం గర్వకారణమన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ రెడ్డి రచించిన సముద్ర శాస్త్ర గ్రంథాలే ప్రపంచంలోని అన్ని యూనివర్సిటీల్లో సముద్ర శాస్త్ర, మత్స్య శాస్త్ర విద్యార్థులు పాఠ్య గ్రంథాలుగా చదువుకోవడం ఉమ్మడి కర్నూలు జిల్లాకు గర్వకారణమన్నారు. ఎంపీఎం రెడ్డి కూతురు మాలతి, కుమారుడు డాక్టర్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తమ తండ్రి కెనడాలో ఉండి కూడా భారతీయ సంస్కృతికి పెద్ద పీట వేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో తెలుగు కళా స్రవంతి అధ్యక్షుడు ఇనాయతుల్లా, సాహితీ స్రవంతి అధ్యక్షులు కెంగార మోహన్, కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, రచయిత గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, గజల్ గాయకుడు మహమ్మద్ మియ్యా, మద్దిలేటి యాదవ్ మాట్లాడారు. ఎంపీఎం రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

కర్నూలు సిటీ: ప్రభుత్వ జూనియర్ కాలేజీ లెక్చరర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని ఓ కాలేజీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడిగా బి.లక్ష్మీ నరసింహులు (దేవనకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ, జువాలజీ లెక్చరర్), ఉపాధ్యక్షుడిగా జీవీ రమణగుప్తా (ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కర్నూలు ఇంగ్లిష్ లెక్చరర్), కార్యదర్శిగా కె.రామాంజనేయులు (ప్రభుత్వ జూనియర్ టౌన్ మోడల్ కాలేజీ, కర్నూలు, కెమిస్ట్రీ లెక్చరర్), జాయింట్ సెక్రటరీగా పి.డేవిడ్ (ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కౌతాళం, కెమిస్ట్రీ లెక్చరర్), కోశాధికారిగా జె.రాహుల్ కుమార్ (ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కాలేజీ, కర్నూలు), మహిళ కార్యదర్శిగా ఎస్.రేష్మా (ప్రభుత్వ జూనియర్ బాలికల కాలేజీ, కర్నూలు), రాష్ట్ర కౌన్సిలర్‌గా పి.శ్రీనివాసులు(ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ), ఆర్.రవీంద్ర బాబు (ప్రభుత్వ జూనియర్ బాలురు కాలేజీ, కర్నూలు) ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా మహమ్మద్ వాయిజ్ ప్రకటించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

బావిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

ఆస్పరి: మండల కేంద్రమైన ఆస్పరి పెద్దబావిలో ఆదివారం గుర్తు తెలియని మహిళా శవం లభ్యమైనట్లు సీఐ మస్తాన్‌వలి తెలిపారు. బావిలో నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు బావిలో మహిళ మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలు ఎరుపు రంగు పంజాబీ డ్రస్ ధరించింది.

టీడీపీలో ఇరువర్గాల ఘర్షణ



దాడిలో గాయపడ్డ మల్లు మహేశ్వర్‌రెడ్డి, కైప రమణా రెడ్డి తదితరులు

సంజామల: గ్రామాల్లో ఆధిపత్యం కోసం తెలుగుదేశం పార్టీలో కుమ్ములాటలు మొదలయ్యాయి. ఈ విషయంలోనే సంజామల మండలం ఆకుమల్ల గ్రామంలో ఆదివారం రెండు వర్గాలు పరస్పరం దాడి చేసుకున్నాయి. వివరాల్లోకి వెళితే.. గ్రామ సంఘం పెద్దను ఎన్నుకునే విషయంలో అధికారపార్టీలో విభేదాలు తలెత్తాయి.సంఘం పెద్ద కోసం మల్లు మహేశ్వర్ రెడ్డి, దుబ్బ రామగోవింద్ రెడ్డి వర్గాల మధ్య పోరు నడుస్తోంది.అయితే, ఆదివారం ఉదయం పాత వారే కొనసాగుతారని మల్లు మహేశ్వర్‌రెడ్డి వర్గం దండోర వేయిస్తుండగా ప్రత్యర్థి వర్గం అడ్డుకుంది. ఈ విషయంలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా మల్లు మహేశ్వర్‌రెడ్డి, ఆయన వర్గానికి చెందిన కైపరమణా రెడ్డి, కైప మోహన్‌రెడ్డికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో దుబ్బ రామగోవింద్‌రెడ్డి, యనకండ్ల తిమ్మయ్యతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

మంత్రాలయం: స్థానిక ఎమ్మిగనూరు రోడ్డులోని జగనన్న కాలనీ సమీపంలో ఓ గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.టవల్‌తో వేప చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ శివాంజల్ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆచూకీ కోసం గుర్తించేందుకు ప్రయత్నించగా ఎటువంటి ఆధారాలు లభించలేదు. యువకుడి వయస్సు దాదాపు 35 నుంచి 40 ఏళ్లు ఉండి, గళ్ల చొక్కా ధరించాడు. మృతదేహం ఉబ్బిపోయి ఉండటంతో మూడు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.

గల్లంతైన బాలుడు శవమై తేలాడు

ఆదోని అర్బన్: రెండు రోజుల క్రితం బసాపురం ఎల్లెల్సీ కాలవలో గల్లంతైన పట్టణంలోని బోయగేరికి చెందిన శేఖర్ కుమారుడు హరికృష్ణ (16) ఆదివారం శవమై కనిపించాడు. అగ్నిమాపక సిబ్బంది సంజీవ్‌కుమార్, మల్లికార్జునరెడ్డి, అనీఫ్, వెంకటేశ్వర్లు, చిదంబరంరెడ్డి, నరసింహులు, మహమ్మద్ శుక్రవారం నుంచి గాలింపు చర్యలు చేపడుతున్నారు. బాలుడు గల్లంతైన ప్రాంతానికి కొద్ది దూరంలో ఆదివారం ఉదయం మృతదేహం కనిపించడంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఆసుపత్రికి తరలించారు. ఇస్వీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గర్భదారణ సమస్యలపై దృష్టి సారించాలి



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యబృందం

కర్నూలు(హాస్పిటల్): గర్భం దాల్చినప్పుడు మహిళలకు అనేక సమస్యలు వస్తాయని, వాటిని ఎప్పటికప్పుడు వైద్యులు గమనిస్తూ తగిన చికిత్సలు అందించాలని, అప్పుడే తల్లీబిడ్డలు పూర్తిగా క్షేమంగా ఉంటారని వైద్యనిపుణులు అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఆబ్‌స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఫాగ్సి) ఆధ్వర్యంలో కర్నూలు కిమ్స్ కడల్స్ ఆసుపత్రిలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రాయలసీమలోని వైద్యులకు నిరంతర వైద్యవిజ్ఞాన సదస్సు (సీఎంఈ) నిర్వహించారు. కర్నూలు జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాలకు చెందిన దాదాపు 200 మంది వరకు గైనకాలజిస్టులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గైనకాలజిస్టు డాక్టర్ కేపీ. శిల్పా మాట్లాడుతూ ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక సదుపాయాలతో గర్భస్థ మహిళలతో పాటు వారి కడుపులో ఉండే శిశువులకు వచ్చే ఎలాంటి సమస్యలైనా పరిష్కరించవచ్చని చెప్పారు. పీడియాట్రిక్ కార్డియాలజిస్టు డాక్టర్ కె.మహమ్మద్ ఫారూక్ మాట్లాడుతూ గర్భస్థ శిశువులకూ గుండెకు సంబంధించిన సమస్యలు ఉండొచ్చని, ప్రసవం అయిన తర్వాత వీలైనంత వెంటనే వాటికి తగిన చికిత్సలు అందించాలని తెలిపారు. అనంతరం గర్భిణిలకు వచ్చే పచ్చకామెర్లు, గుండె సమస్యలు, హైబీపీ, మధుమేహం, ఇతర సమస్యలు, వాటిని గుర్తించి చికిత్స చేసే పద్ధతుల గురించి నిపుణులు వివరంగా చర్చించారు. కార్యక్రమంలో ఫాగ్సి ప్రెసిడెంట్ ఎస్. వెంకటరమణ, కార్యదర్శి వి.రాధాలక్ష్మి, గర్భస్థ శిశు సమస్యల నిపుణురాలు కె.నివేదిత, గైనకాలజిస్ట్, వై.కుసుమ, కె.లక్ష్మీప్రసన్న, ఎ.సుధారాణి, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు కె.నవీన్, ఎస్.జె. జానకీరామ్, ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్టు జి.సందీప్‌కుమార్, నియోనెటాలజిస్టు ఎస్.భారతి పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో పారిశుధ్ద్య కార్మికుడి మృతి



మృతదేహంతో ధర్నా చేస్తున్న పారిశుధ్యకార్మికులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పారిశుధ్ద్య కార్మికుడు జె.నాగేష్(41) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. మూడు రోజుల క్రితం తను పనిచేసే క్యాజువాలిటీలో అస్వస్థతకు గురి కాగా అక్కడే వైద్యులు చికిత్స అందించి ఇంటికి పంపించారు. ఆదివారం ఉదయం నుంచి మళ్లీ ఆరోగ్యం బాగాలేక పోవడంతో కుటుంబసభ్యులు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే నాగేష్ మరణించాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్ద్య కార్మికులు ధర్నా చేశారు. మరణించిన అతని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం వల్లే కార్మికులు శారీరక, మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారితో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చర్చించి పంపించారు. కార్యక్రమంలో సుజాత, సునీత, విజయ్‌కుమారి, మల్లేశ్వరి, మురళి, ప్రసాద్, మహేష్, డేవిడ్, డ్రైవర్ భాషా, రంగన్న పాల్గొన్నారు.

వాగులో మునిగి గొర్రెల కాపరి మృతి



మృతుడు కృష్ణుడు

ఆళ్లగడ్డ/రుద్రవరం: చందలూరు–నల్లగట్ల గ్రామ పొలిమేర మధ్యలో వక్కిలేరు వాగు నీటిలో మునిగి ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం గొర్రెలను ఏరు దాటిస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రుద్రవరం మండలం నక్కలదిన్నెకు చెందిన శివరాం, పాపారాయుడు, నారబోయిన కృష్ణుడు (54) అనే ముగ్గురు దాదాపు 700 గొర్రెలను పెంచుతున్నారు. వాటిని మేపేందుకు ప్రతి రోజు చుట్టు పక్కల గ్రామాల పొలాల్లోకి వెళ్లేవారు. ఈక్రమంలోనే ఆదివారం నక్కలదిన్నె నుంచి చందలూరు–నల్లగట్ల పొలిమేర మధ్యకు వెళ్లారు. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో గొర్రెలను సమీపంలోని వక్కిలేరు వాగులోకి తోలారు. అందులో వాటికి ఈత నేర్పి తీసుకొస్తున్న సమయంలో కొన్ని గొర్రెలు వారిపై దూకాయి. ఈ ఘటనలో శివరాం, పాపారాయుడు అతి కష్టం మీద ఒడ్డుకు చేరుకోగా నారబోయిన కృష్ణుడు మాత్రం నీటిలో మునిగిపోయాడు. ఎంత గాలించినా ఆచూకీ లభించకపోవడంతో సమాచారం అందుకున్న ఆళ్లగడ్డ పోలీసులు అక్కడికి చేరుకొని స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. నారబోయిన కృష్ణుడుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని పోలీసులు చందలూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ప్రాథమిక చికిత్స చేయించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆళ్లగడ్డ పోలీసులు తెలిపారు.

హాస్టల్ విద్యార్థినులకు తప్పిన ప్రమాదం



విరిగి పడ్డ కిటికి దిమ్మె

నంద్యాల(అర్బన్): స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని జూనియర్ కళాశాల గిరిజన బాలికల వసతి గృహం విద్యార్థినులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆదివారం ఉన్నట్టుండి హాస్టల్ రెండో అంతస్తు కిటికి దిమ్మె విరిగి కింద పడింది. అయితే, ఆ సమయంలో విద్యార్థినులంతా బయట వరండాలో ఘటనా స్థలానికి కొద్ది దూరంలో ఉండటంతో ప్రమాదం తప్పింది. హాస్టల్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, పలు గదులు పెచ్చులూడి వర్షానికి కారుతున్నాయని విద్యార్థినులు వాపోయారు. ప్రమాదం జరగకముందే అధికారులు భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



భానుడు భగభగ మంటున్నాడు. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతోంది. 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇంట్లో ఉన్న జనాలు బయటకు పోవాలంటే జంకుతున్నారు. ఇక పశుపక్షాదుల పరిస్థితి తలుచుకుంటే అయ్యో పాపం అనాల్సిందే. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు నీటి నిల్వలను ఆశ్రయిస్తున్నాయి. దొర్నిపాడు సమీపంలో కేసీ క్యాలలో నిలిచిన నీటిలో బాతుల గుంపు సేదదీరుతూ కనిపించింది.
– దొర్నిపాడు